
జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| మంగళవారం 17 మార్చి 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 288 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## రాష్ట్రవ్యాప్తంగా నేడు 'ఫార్మర్ కిట్స్' పంపిణీ ప్రారంభించనున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, మార్చి 17: రాష్ట్రంలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన రైతులకు 'ఫార్మర్ కిట్స్' పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేడు ఉదయం 10 గంటలకు రాష్ట్ర సచివాలయం నుండి లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 489 క్లస్టర్లలో ఈ పంపిణీ జరుగుతుండగా ప్రతి క్లస్టర్‌కు 125 మంది చొప్పున మొత్తం 61,125 మంది రైతులకు ఈ కిట్లను అందజేయనున్నారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ఈ కిట్‌లో క్లాత్ బ్యాగ్, క్షేత్ర దర్శిని డైరీ, గుర్తింపు కార్డు, ప్రత్యేక క్యాలెండర్, టోపీ, పెన్ మరియు చిన్న ప్యాకెట్ డైరీ వంటి వస్తువులు ఉంటాయని అధికారులు తెలిపారు. సచివాలయంలో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయా జిల్లాల్లోని రైతు వేదికలలో స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా రైతులకు కిట్లను పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ సంచాలకులు డా. బి. గోపి ఐఏఎస్ తెలిపారు.



## శాసనమండలి ప్రవేశద్వారం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, మార్చి 17: రాష్ట్ర శాసనసభ సమావేశాల సందర్భంగా శాసనమండలి ప్రవేశద్వారం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ప్రజాప్రతినిధులకు సూచించారు. సభా కార్యక్రమాల్లో సభ్యులు చురుకుగా పాల్గొని ప్రజల సమస్యలను ప్రస్తావించాలని, ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా వివరించాలని సీఎం పేర్కొన్నారు. శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన అంశాలపై సమగ్ర చర్చ జరగాలని ఆయన సూచించారు. సమావేశాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించేందుకు సభ్యులు పూర్తి సన్నద్ధంగా ఉండాలని సీఎం సూచించినట్లు సమాచారం. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రితో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు.



## కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం నందిని సిధారెడ్డికి – తెలంగాణ సాహిత్యానికి గౌరవం


సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, మార్చి 17: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం మొదటిసారిగా మంజీర రచయితల సంఘం తరపున తీర్మానం చేసిన నందిని సిధారెడ్డి గారికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం తెలంగాణ సాహిత్యానికి దక్కిన గౌరవమని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి అభిప్రాయపడ్డారు. 'నాగేటి చాలల్ల నా తెలంగాణ' పాట ద్వారా తెలంగాణ గడప గడపను చైతన్య పరిచిన నందిని సిధారెడ్డి రాష్ట్ర అవతరణ అనంతరం తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులుగా తెలంగాణ సాహిత్య వికాసానికి శక్తివంచన లేకుండా కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. ప్రపంచం మొత్తం కరోనా మహమ్మారి కారణంగా తీవ్ర ఆందోళనలో ఉన్న సమయంలో ఒక కవిగా వేదనతో రచించిన 'అనిమేష' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించడం తెలంగాణ సాహిత్యానికి అంతర్జాతీయ గుర్తింపు లభించినట్టేనని నామోజు బాలాచారి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ – అక్రమాలపై కఠిన చర్యలు

సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, మార్చి 17: హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో సహచర మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులపై సమగ్రంగా చర్చించారు. అర్హులకే ఇళ్లు అందేలా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేయాలని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గవద్దని అధికారులకు స్పష్టం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పొంది వాటిలో నివాసం లేకుండా అద్దెకు ఇస్తున్నవారికి లేదా ఖాళీగా ఉంచిన వారికి నోటీసులు జారీ చేసి ఏప్రిల్ 30 వరకు గడువు ఇవ్వాలని, స్పందించని వారి కేటాయింపులను రద్దు చేసి అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలని మంత్రి ఆదేశించారు. నాలుగు జిల్లాల పరిధిలో ఉన్న కాలనీల్లో విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజ్ వంటి కనీస వసతులు కల్పించాలని, ముఖ్యంగా 22 వేల ఇళ్లకు విద్యుత్ మీటర్లను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ టవర్లను దశలవారీగా పూర్తి చేసి పూర్తయిన ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని తెలిపారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, ఎండీ వీపీ గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.



## నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, మార్చి 17: ఈ నెల 22వ తేదీన నర్మెట్టలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవాన్ని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించి, ఏపీసీ మరియు వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నర్మెట్టలో రైతుమేళా నిర్వహించనున్నట్లు, రైతులకు ఉపయోగపడేలా వివిధ స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఆయిల్ పామ్ పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచనలు ఇచ్చారు.

## సీఎం రేవంత్ రెడ్డితో ప్రముఖ ఆర్థికవేత్త అర్వింద్ సుబ్రమణియన్ భేటీ

సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, మార్చి 17: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రముఖ భారత ఆర్థికవేత్త అర్వింద్ సుబ్రమణియన్ అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భేటీలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ముఖ్యంగా విద్యుత్ రంగంలో ఖర్చుల నమూనా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ విభాగంలో మూల్యాంకన విధానం, జీఎస్టీ పరిధిలో పన్నుల అంచనా వంటి అంశాలపై సీఎం, డిప్యూటీ సీఎం అర్వింద్ సుబ్రమణియన్‌తో చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మరింత మెరుగుపరుచుకునేందుకు పలు కీలక సూచనలు సుబ్రమణియన్ చేసినట్లు సమాచారం. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని, ఆదాయ వనరులను పెంచే చర్యలు చేపట్టాలని ఆయన సూచించినట్లు సమావేశంలో పాల్గొన్న అధికారులు తెలిపారు



## ప్రజావాణి ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

### పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి - ప్రజావాణిలో 68 వినతులు స్వీకరణ




సందేశం టైమ్స్, సూర్యాపేట ప్రతినిధి, మార్చి 17: ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, వివిధ శాఖల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని, రాష్ట్ర స్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కలెక్టరేట్‌లోని ప్రతి కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫైల్స్‌ను సక్రమంగా నిర్వహించాలని, ప్రతి సిబ్బంది హాజరు ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ప్రతి కార్యాలయాన్ని సందర్శిస్తానని, ఫైల్స్ సరిగా లేకపోయినా లేదా కార్యాలయాలు పరిశుభ్రంగా లేకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించిన 41 దరఖాస్తులు, డిడబ్ల్యుఓకు 4, డిపిఓకు 3, డీఆర్‌డీఏకు 3, ఇతర శాఖలకు చెందిన 17 దరఖాస్తులు కలిపి మొత్తం 68 దరఖాస్తులు అందాయని, వాటిని పరిష్కారం కోసం సంబంధిత శాఖలకు పంపినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం సంబంధిత శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న ఆడిట్ పేరాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శిరీష, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, సీపీఓ కిషన్, డీఈఓ అశోక్, సంక్షేమ అధికారులు నర్సింహారావు, నరసింహ, శంకర్ తదితర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమీకృత జిల్లా కార్యాలయాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### కార్యాలయాల్లో పరిశుభ్రత, ఫైల్స్ నిర్వహణపై అధికారులకు సూచనలు




సందేశం టైమ్స్, సూర్యాపేట ప్రతినిధి, మార్చి 17: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కలెక్టరేట్‌లోని "సి" సెక్షన్, జిల్లా కోశాధికారి కార్యాలయం, జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, ఎన్ఐసీ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కార్యాలయం, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం తదితర విభాగాలను సందర్శించి కార్యాలయాల పరిశుభ్రత, ఫైల్స్ నిర్వహణ, హాజరు పట్టికలు, పీఆర్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యాలయాల్లో ఫైల్స్‌ను క్రమపద్ధతిలో నిర్వహించాలని, ఎలాంటి చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని, హాజరు పట్టికలు మరియు రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో ఈవో సుదర్శన్ రెడ్డి మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలి: అదనపు కలెక్టర్ పాండు




సందేశం టైమ్స్, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 17: ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ పాండు అన్నారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి కలిసి ప్రజల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. భూమి సమస్యలు, పింఛన్లు, సంక్షేమ పథకాలకు సంబంధించిన అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు, వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 57 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. అందిన ప్రతి వినతిని నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపినట్లు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని వాటికి తక్షణ పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్ టి. వెంకట రామరావుకు అశ్రునివాళి



సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, మార్చి 17: డాక్టర్ టి. వెంకట రామరావు ఆత్మశాంతి కోసం నిర్వహించిన ఉదక శాంతి మరియు ద్వాదశ దిన కర్మ కార్యక్రమాలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దనాన్న కుమారుడు, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ జితేందర్ రావు తనుగుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. అంత్యక్రియల నుంచి ద్వాదశ దిన కర్మల వరకు అన్ని కార్యక్రమాలను ఆయన కుటుంబ బాధ్యతగా భావించి స్వయంగా పర్యవేక్షించారు. తన సతీమణి రేణుకతో కలిసి ఈ పుణ్యకార్యంలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ క్రతువులో బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని మరణించిన వారి ఆత్మకు సద్గతులు కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామరావు ధర్మపత్ని శ్రీదేవి తన భర్తతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కుమార్తెలు శిరీష, హిమబిందు, ఇందిర ప్రియదర్శిని కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. అల్లుడు శశికుమార్, కుటుంబ సభ్యులు సతీష్ కుమార్, శశికళ, జ్యోతి, సుహర్షి, హర్ష, చంద్రిక, ధనుష్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖులు డాక్టర్ టి.ఆర్.కే. రావు (డైరెక్టర్ జనరల్ మైనింగ్, నాగ్‌పూర్) కుటుంబ సభ్యులు, డాక్టర్ జితేందర్ రావు తల్లి రేవతి తదితరులు హాజరై నివాళులర్పించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో శ్రీ సదాశివ రావు విష్ణుదాస్ విశేష కృషి చేశారు.

## నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో బేటీ జన్మోత్సవ కార్యక్రమం





సందేశం టైమ్స్, నారాయణఖేడ్ ప్రతినిధి, మార్చి 17: నారాయణఖేడ్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం సహకారంతో బేటీ జన్మోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పుట్టిన ఆడ శిశువులను గౌరవిస్తూ బేటీ జన్మోత్సవ కిట్లు మరియు ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. బాలిక జననాన్ని ఆనందంగా జరుపుకోవడం ద్వారా సమాజంలో బాలికల పట్ల గౌరవ భావన పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బేటీ బచావో బేటీ పడావో పథకం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు పని చేసే ప్రదేశాల్లో మహిళలపై జరిగే లైంగిక వేధింపులను నివారించేందుకు రూపొందించిన పోష్ చట్టం గురించి వివరించారు. అలాగే ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం కూడా నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి మాట్లాడుతూ బాలికల రక్షణ, విద్య, సాధికారతకు బేటీ బచావో బేటీ పడావో పథకం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు అవసరమైన వైద్య సేవలు సమయానికి అందిస్తున్నామని తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాత గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన పోషకాహారం, పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రీజినల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనురాధ, సబ్ ఇన్‌స్పెక్టర్ మొగులయ్య, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గాయత్రి బ్యాంక్ కోదాడ బ్రాంచ్ తొలి వార్షికోత్సవం ఘనంగా

సందేశం టైమ్స్, కోదాడ ప్రతినిధి, మార్చి 17: కోదాడలోని గాయత్రి బ్యాంక్ బ్రాంచ్ తొలి వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ కె. కిశోర్ మాట్లాడుతూ గత ఒక సంవత్సరం కాలంలో కస్టమర్లు ఉంచిన నమ్మకం మరియు సిబ్బంది కృషితో బ్రాంచ్ మంచి అభివృద్ధి సాధించిందని తెలిపారు. గాయత్రి బ్యాంక్ ద్వారా కస్టమర్లకు అనేక ఆధునిక సౌకర్యాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా గోల్డ్ లోన్‌పై జీరో ప్రాసెసింగ్ ఛార్జీలు, 24 గంటల ఎటీఎం సేవలు, అలాగే ఎన్ఈఎఫ్‌టి, ఆర్‌టీజీఎస్ మరియు మొబైల్ బ్యాంకింగ్ సేవలను ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా బ్రాంచ్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్ తోట జ్యోతి శ్రీనివాస్, స్మార్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసన్న కుమార్, వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్ అధ్యక్షులు స్వామి పుల్లయ్య, మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ రిటైర్డ్ మేనేజర్ స్వామి శ్రీనివాస్ రావు, చల్లా వెంకటేశ్వర రావు తదితర ప్రముఖులు మరియు కస్టమర్లు పాల్గొని బ్రాంచ్ తొలి వార్షికోత్సవ వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.

## స్త్రీల సాధికారతకు స్వయం ఉపాధి మార్గం




సందేశం టైమ్స్, ఖమ్మం ప్రతినిధి, మార్చి 17: స్త్రీలు సాధికారత సాధించి స్వయం ఉపాధితో తమ కాళ్ల మీద తాము నిలబడటం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ అన్నారు. ఖమ్మం పట్టణంలోని యుపిహెచ్ కాలనీలో 'సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్లు, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు కుట్టు మిషన్లు అందజేసి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు తమ జీవితాలను మరింత స్థిరంగా మార్చుకునే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆలోచన ఉందని తుమ్మల యుగంధర్ చెప్పారు. ఈ తరహా కార్యక్రమాలను సిడిఏ సంస్థ ముందుగా చేపట్టడం అభినందనీయమని నిర్వాహకులు సిడిఏ కార్యదర్శి రెవరెండ్ ఎనోష్ కుమార్‌ను అభినందించారు. సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్న సంస్థలకు తమ వంతు సహకారం అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్వయం ఉపాధి శిక్షణ పొందిన మహిళలు కుట్టు మిషన్ల సహాయంతో ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాలకు ఆదారం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిడిఏ కార్యదర్శి ఎనోష్ కుమార్, క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు తుంపాల కృష్ణమోహన్, టీఎన్జీవో గెజిటెడ్ ఖమ్మం టౌన్ అధ్యక్షులు ఇంజం కృష్ణార్జునరావు, కర్లకుంట దావీదు తదితర ప్రముఖులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 100 ప్రాథమిక పాఠశాలల తనిఖీ పూర్తి





సందేశం టైమ్స్, మనూర్ మండల ప్రతినిధి, మార్చి 17: మనూర్ మండలంతో పాటు పరిసర మండలాల్లో జిల్లా అధికారుల బృందం నిర్వహించిన ప్రాథమిక పాఠశాలల తనిఖీలు విజయవంతంగా పూర్తి అయ్యాయి. డిసెంబర్ మొదటి తేదీ నుంచి ఇప్పటివరకు మొత్తం 100 ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి సంబంధిత మండలాల మండల విద్యాధికారులకు సమాచారం సహా నివేదికలు అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం మనూర్ మండలంలోని దోసపల్లి ప్రాథమిక పాఠశాలను జిల్లా నోడల్ అధికారి ప్రదీప్ కుమార్‌తో పాటు జిల్లా టీమ్ అధికారులు వహాబోద్దీన్, నిమ్మల కిష్టయ్యలు పరిశీలించారు. తనిఖీల సమయంలో మనూర్ మండల విద్యాధికారి రాజ్‌కుమార్ అక్కడికి చేరుకుని జిల్లా అధికారుల బృందాన్ని అభినందించారు. అలాగే మనూర్, నాగలిగిద్ద, మొగుడంపల్లి, జహీరాబాద్, ఝరాసంఘం మండలాల విద్యాధికారులు రాజ్‌కుమార్, నందకిషోర్, మొహమ్మద్ జాఫర్ అలీ, మాణయ్య, శ్రీనివాస్‌లకు వివిధ పాఠశాలల తనిఖీ వివరాలు, నివేదికలు అందజేసి పాఠశాలల స్థితిగతులను వివరించారు. జిల్లా అధికారుల బృందం 100 ప్రాథమిక పాఠశాలల తనిఖీ పూర్తి చేయడం పట్ల వివిధ మండలాల విద్యాధికారులు అభినందనలు తెలిపారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వ్యక్తి మృతి



సందేశం టైమ్స్, రాయికోడ్ ప్రతినిధి, మార్చి 17: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల్ మందపూర్ నుంచి నల్లంపల్లి వెళ్ళే రహదారిలో ఈ రోజు గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వాహనం స్కిడ్ కావడం లేదా నేరుగా ఢీకొనడం కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని ఆధార్ కార్డు ఆధారంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# శ్రీశ్రీ శ్రీ నల్లపోచమ్మ దేవికి విశేష పూజలు – భక్తిశ్రద్ధలతో మహా మంగళహారతి



సందేశం టైమ్స్ మనూర్ మండల్ మర్చి 17( టీ సంగమేశ్వర్,)సంగారెడ్డి జిల్లా మనూర్ మండల్ బోరంచ గ్రామం లో మంజీరా నది ఒడ్డున వెలసిన శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ దేవి ఆలయంలో సోమవారం ప్రాతఃకాలంలో విశేష పూజలు, అలంకరణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ స్వామి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మహా మంగళహారతి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగగా, "ఓం శ్రీ మాత్రేనమః" నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

# కోహిర్‌లో రంజాన్ ఇఫ్తార్ విందు – మాజీ మంత్రి డా. ఏ. చంద్రశేఖర్ పాల్గొన్నారు





సందేశం టైమ్స్, కోహిర్ ప్రతినిధి, మార్చి 17: సంగారెడ్డి జిల్లా కోహిర్ పట్టణంలోని భరత్ ఫంక్షన్ హాల్‌లో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో పట్టణం మరియు మండల ముస్లిం ప్రజల కోసం ఘన ఇఫ్తార్ విందు నిర్వహించబడింది. మాజీ మంత్రివర్యులు, జహీరాబాద్ ఇంచార్జ్ డా. ఏ. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై, ముఖ్యమంత్రి అందిస్తున్న ఈద్-ఖా తోఫా ప్యాకెట్లను నిరుపేద మైనారిటీ ముస్లిం కుటుంబాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోహిర్ మునిసిపల్ ఛైర్మన్ అశోక్ కుమార్, వైస్ ఛైర్మన్ హన్నన్ జావీద్, పట్టణ అధ్యక్షుడు శంషీర్ అలీ, మాజీ ఎంపీపీ షౌకత్ అలీ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, వార్డు కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఎంఆర్ఓ తదితరులు పాల్గొన్నారు. నాయకులు ఈ కార్యక్రమం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.



# మంజీరా వాటర్ లీకేజ్ వాహనదారులకు ఇబ్బంది

పటాన్చెరు, మార్చి 17 (సందేశం టైమ్స్ బీ. డేవిడ్) – పటాన్చెరువు మండల్, ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో పెద్ద వాగు పైన ఉన్న మంజీరా పైప్‌లైన్ జాయింట్ గత పది రోజులుగా లీక్ అవుతూ వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. మంజీరా లైన్ రోడ్డు పక్కన ఉన్నందున నీరు స్రవంతి వాహనాలపై పడటం, రోడ్డు దెబ్బతినడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. స్థానికులు, వడ్డే సాయి వంటివారు అధికారులు దీన్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్ ప్రెషర్ తగ్గినా, లీకేజ్ గత పది రోజులుగా కొనసాగుతోందని వారు తెలిపారు.



# జానకం పేటలో ఘనంగా మల్లన్న జాతర

పటాన్చెరు, మార్చి 17 (సందేశం టైమ్స్ బీ. డేవిడ్) – అమీన్పూర్ డివిజన్లోని జానకం పేటలో సోమవారం శ్రీ శ్రీ శ్రీ మల్లన్న కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పటాన్చెరు శాసనసభ్యుడు, ఎమ్మెల్యే గుడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. పటాన్చెరు నియోజకవర్గ ప్రజలు ఆలయంలో ప్రత్యేక పూజలతో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మల్లన్న ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సుధాకర్ రెడ్డి, అమీన్పూర్ మున్సిపల్ మాజీ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ సర్పంచ్ పాండు, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.




# హుజూర్ నగర్ మున్సిపాల్టీ 2160 సింగిల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తి దశలో – ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలు

హుజూర్ నగర్, మార్చి 17 (సందేశం టైమ్స్) – హుజూర్ నగర్ మున్సిపాల్టీ రామస్వామి గుట్ట వద్ద నిర్మాణంలో ఉన్న 2160 సింగిల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి దశకు చేరుతున్నాయి. నీటి పారుదల & పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు, "ఇది 15 ఏండ్ల కల సాకారం కాబోతుంది. లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి రాజకీయాలకు తావు లేదు.ఇండ్లు లేని ప్రతి అర్హుడికి మోడల్ కాలనీలో ఇండ్లు ఇవ్వబడతాయి. అర్హతలేనివారికి ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వబడదు."మంత్రివారి ప్రకారం, RDO ద్వారా ప్రచురితమైన డ్రాఫ్ట్ లిస్ట్ లో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేయవచ్చును, అవి పరిశీలించబడతాయి. అదేవిధంగా అర్హులైన లబ్దిదారులు కూడా లిఖిత పూర్వకంగా RDO గారికి తమ వివరాలు అందజేయవచ్చు. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని, అందరూ దృష్టిలో పెట్టుకోవాలని మంత్రి సూచించారు.

# రాబి సీజన్ సన్నాహక సమావేశం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సివిల్ సప్లైజ్ అధికారులతో సమావేశం

హైదరాబాద్, మార్చి 17 (సందేశం టైమ్స్) – రాష్ట్ర, జిల్లా స్థాయి సివిల్ సప్లైజ్ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాబి పంట సన్నాహక సమావేశం నిర్వహించారు. మంత్రి చెప్పారు, తెలంగాణలో పాడి ఉత్పత్తి మరియు కొనుగోళ్లలో దేశవ్యాప్తంగా రికార్డులు సృష్టిస్తున్నామని. ప్రతి సంవత్సరం, కాంగ్రెస్ ప్రభుత్వం పాడి కొనుగోళ్ల కోసం రైతులకు MSP మరియు బోనస్ రూపంలో రూ. 40–45 వేల కోట్లు ఇవ్వడం ద్వారా రైతుల ఆర్థిక భద్రత మరియు న్యాయమైన ఆదాయాన్ని నిర్ధారిస్తున్నామని ఆయన వివరించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీమ్ ఇండియా క్రికెటర్ తిలక్ వర్మ సత్కారం



హైదరాబాద్, మార్చి 17 (సందేశం టైమ్స్) – T20 క్రికెట్ వరల్డ్ కప్-2026 ఘన విజయం సాధించిన టీమ్ ఇండియా ఆల్ రౌండర్ తిలక్ వర్మ జూబ్లీహిల్స్ నివాసానికి చేరుకుని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి గారు తిలక్ వర్మను సత్కరించి విజయాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# తెలంగాణ సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం సంకల్పంతో ముందుకు – గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా

హైదరాబాద్, మార్చి 17 (సందేశం టైమ్స్) – తెలంగాణకు సంబంధించిన సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధి లక్ష్యాన్ని సాకారం చేసుకోవడానికి ఐకమత్యంతో, ఆత్మవిశ్వాసంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని గౌరవ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా గారు పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు.గవర్నర్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు లక్ష్యాలను వివరిస్తూ, బలహీన వర్గాలకు భరోసా, ప్రపంచానికి ఆదర్శంగా తెలంగాణను తీర్చిదిద్దడంలో ప్రభుత్వం అగ్రగామిగా ముందుకు సాగుతోందని తెలిపారు.రాష్ట్రంలో నీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరచడం, వ్యవసాయ ఉత్పాదకత పెంచడం, రైతు సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయడంపై గమనార్హమైన చర్యలు చేపట్టబడినట్లు వివరించారు. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రణాళికా బద్ధంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.సమగ్ర, సమతుల్య అభివృద్ధి సాధించేందుకు తెలంగాణ క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా విభజించి వికేంద్రీకృత వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు, నగరీకరణ వేగాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా పునర్వ్యవస్థీకరించిన విషయాన్ని గవర్నర్ పేర్కొన్నారు. పేద కుటుంబాలకు, రైతులకు, మహిళలకు, యువతకు, విద్యార్థులకు, ఉద్యోగార్థులకు ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ సంక్షేమ చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, బలమైన మౌలిక సదుపాయాలు, నగర పునరుద్ధరణ, భవిష్యత్తు ఇంధన, పరిశ్రమల అభివృద్ధి పథకాలు, సమగ్ర రూరల్-అర్బన్ అభివృద్ధి ప్రణాళికలు గురించి గవర్నర్ వివరణ ఇచ్చారు.గవర్నర్ ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం చారిత్రక మార్పు దశలో ఉన్నది, సమ్మిళిత అభివృద్ధి దిశగా ప్రభుత్వం స్పష్టతతో, సంకల్పంతో ముందుకు సాగుతున్నది అని హృదయపూర్వకంగా తెలిపారు.

# శాసనసభలో "తెలంగాణ తల్లి" విగ్రహ ఆవిష్కరణ – గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు

హైదరాబాద్, మార్చి 17 (సందేశం టైమ్స్) – శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ జాతి గౌరవం, నిరంతర స్ఫూర్తికి ప్రతీకగా, సంస్కృతిని, అస్తిత్వాన్ని ప్రతిబింబించే శక్తి స్వరూపిణి "తెలంగాణ తల్లి" విగ్రహాన్ని గౌరవ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా గారు ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారితో కలిసి ఆవిష్కరించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభ రోజున జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క, డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.ప్రారంభంగా గవర్నర్ గారు మరియు ముఖ్యమంత్రి గారు అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించిన తర్వాత, పునరుద్ధరించిన శాసనమండలి భవనం ఎదురుగా ఏర్పాటుచేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించారు.



# అగ్నిప్రమాదంలో SCB మెడికల్‌లో పలువురు ప్రాణాలు కోల్పోవడం – తెలంగాణ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు దిగ్భ్రాంతి వ్యక్తం

సందేశం టైమ్స్ – కటక్, మార్చి 17 (ప్రతినిధి) కటక్‌లోని SCB మెడికల్ కాలేజీ & హాస్పిటల్‌లో ట్రామా కేర్ విభాగంలో మంటలు చెలరేగి పలువురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరమని తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి వర్యులు దామోదర్ రాజనర్సింహ గారు పేర్కొన్నారు. మంత్రిగారు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ఘన నివాళులు అర్పించారు. గాయపడిన వారికి తక్షణం మెరుగైన వైద్యం అందించడం కోసం ఒడిశా ప్రభుత్వం చేపట్టిన చర్యలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా దేశవ్యాప్తంగా ఆసుపత్రుల్లో అగ్నిప్రమాద భద్రతా చర్యలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. అగ్నిప్రమాద సమయంలో ప్రాణాలకు తెగించి రోగులను రక్షించిన వైద్య సిబ్బంది, నర్సులు, సిబ్బందిని మంత్రి గారు అభినందించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.


# లాస్ ఏంజెల్స్‌లో 98వ ఆస్కార్ అవార్డుల ఘనోత్సవం

సందేశం టైమ్స్ – లాస్ ఏంజెల్స్, మార్చి 17 (ప్రతినిధి) లాస్ ఏంజెల్స్‌లో 98వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ ఏడాది ఉత్తమ సహాయనటి అవార్డు ఎమీ మాడిగన్ (వెపన్స్) గారికి లభించగా, ఉత్తమ యానిమేటెడ్ ఫిల్మ్‌గా K POP డెమన్ హంట్స్ ఎంపికైంది. ఉత్తమ యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్‌గా ది గర్ల్ హూ క్రైడ్ పెరల్స్‌కి అవార్డు దక్కింది. ఉత్తమ కాస్ట్యూమ్, హెయిర్ స్టైలింగ్ విభాగంలో ఫ్రాంకిన్‌స్టన్ విజేతగా నిలిచింది. ఉత్తమ కాస్టింగ్ అవార్డును వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ ఫిల్మ్ దక్కించుకుంది.


## నెతన్యాహు మరణించారంటూ సోషల్ మీడియా వదంతులు – ఎక్స్‌లో ప్రత్యక్షంగా వీడియోతో స్పష్టత

సందేశం టైమ్స్ హైదరాబాద్ మార్చి 17 (ప్రతినిధి) – సోషల్ మీడియాలో ప్రచారం అయిన "నెతన్యాహు మరణించారని" వార్తలను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమెన్ నెతన్యాహు ఖండించారు. నెతన్యాహు తాజాగా ఎక్స్‌లో వదంతుల్ని నమ్మొద్దని తన వీడియోను పోస్ట్ చేశారు. ఈ వీడియోలో ఆయన నిన్న కాఫీ తాగుతున్న దృశ్యాలు, అలాగే పర్యాటక ప్రాంతంలో ప్రజలతో కలిసి సంభాషిస్తున్న సన్నివేశాలు కనిపించాయి. నెతన్యాహు తన ఆరోగ్యం క్షీణించిందని, ఇంట్లోనే గడిపిపోకుండా కొంతసేపు బయటకు వచ్చి గాలి పీల్చుకోవాలని సూచించారు. ఈ వీడియో ద్వారా ఆయనపై పుట్టిన సందేహాలను తొలగించమని అభిమానులు, ప్రజలకు తెలియజేశారు.

# ట్రంప్ ప్రకటన: ఇరాన్‌లో కీలక లక్ష్యాలపై దాడులు – రక్షణ సామర్థ్యం, క్షిపణి తయారీ వ్యవస్థ నాశనం




సందేశం టైమ్స్ – వాషింగ్టన్, మార్చి 17 (ప్రతినిధి) అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా సమావేశంలో ఇరాన్‌పై తాము చేసిన దాడుల వివరాలను వెల్లడించారు. ఆయన ప్రకారం, "ఇరాన్‌లోని కీలక లక్ష్యాలను ధ్వంసం చేశాం, చమురు పైపులైన్లకు మినహాయింపు ఇచ్చాం, ఏదో ఒక రోజు ఇరాన్‌ను పునర్నిర్మిస్తాం. ఇరాన్ ఎప్పటికీ ఇలాగే ఉండబోదు. ఇరాన్ రక్షణ సామర్థ్యాన్ని ధ్వంసం చేశాం, క్షిపణులు తయారు చేయగల సామర్థ్యాన్ని దెబ్బతీశాం. మందుపాతరలను అమర్చే 30 నౌకలను నీట ముంచేశాం. ఇప్పటి వరకు ఇరాన్‌లోని 7 వేలకు పైగా లక్ష్యాలపై దాడులు చేశాం" అని తెలిపారు.




| Poll Events | Date and Day |
|---|---|
| Date of Issue of Gazette Notification | 16.03.2026 (Monday) |
| Last Date for making Nominations | 23.03.2026 (Monday) |
| Date for the scrutiny of Nominations | 24.03.2026 (Tuesday) |
| Last date for the withdrawal of candidatures | 26.03.2026 (Thursday) |
| Date of Poll | 09.04.2026 (Thursday) |
| Date of Counting | 04.05.2026 (Monday) |
| Date before which election shall be completed | 06.05.2026 (Wednesday) |

## రాజకీయం నేటి నుంచే గెజిట్ నోటిఫికేషన్ విడుదల.. నగారా మోగించిన కేంద్ర ఎన్నికల సంఘం

# ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల: మే 4న కౌంటింగ్

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్:


కేరళ: కేరళ రాష్ట్ర 14వ శాసనసభకు జరగనున్న సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. మార్చి 16న (సోమవారం) గెజిట్ నోటిఫికేషన్ విడుదలవుతుంది. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ మార్చి 23 (సోమవారం). మార్చి 24న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఉపసంహరణకు మార్చి 26 (గురువారం) చివరి తేదీ. ఏప్రిల్ 9న (గురువారం) రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ జరుగుతుంది. మే 4న (సోమవారం) ఓట్ల లెక్కింపు చేపట్టి, మే 6వ తేదీ (బుధవారం) నాటికి ఎన్నికల ప్రక్రియ అంతా పూర్తి కానుంది.

పుదుచ్చేరి: కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి శాసనసభ ఎన్నికల షెడ్యూల్ కూడా ఖరారైంది. కేరళతో పాటే మార్చి 16న గెజిట్ నోటిఫికేషన్, మార్చి 23 నామినేషన్ల దాఖలుకు తుది గడువు ఉంటుంది. మార్చి 24న పరిశీలన, మార్చి 26 ఉపసంహరణకు అవకాశం కల్పించారు. ఏప్రిల్ 9న పోలింగ్, మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. మే 6 నాటికి మొత్తం ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది.

అస్సాం: అస్సాం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ కేరళ మరియు పుదుచ్చేరిలతో సమానంగా ఉంది. మార్చి 16న గెజిట్ నోటిఫికేషన్ వెలువడుతుంది, మార్చి 23 నామినేషన్ల దాఖలుకు తుది గడువు. మార్చి 24న నామినేషన్ల పరిశీలన, మార్చి 26న ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఏప్రిల్ 9న అస్సాంలో పోలింగ్ జరుగుతుంది. మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టి, మే 6 నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తారు.

పశ్చిమ బెంగాల్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ భిన్నంగా ఉంది. నోటిఫికేషన్ల జారీ, నామినేషన్ల దాఖలు మరియు పోలింగ్ వంటి అంశాలు పైన పేర్కొన్న రాష్ట్రాల కంటే తరువాత ప్రారంభమవుతాయి. మార్చి 30న గెజిట్ నోటిఫికేషన్ వెలువడుతుంది, ఏప్రిల్ 6 నామినేషన్ల దాఖలుకు తుది గడువు. ఏప్రిల్ 7న నామినేషన్ల పరిశీలన, ఏప్రిల్ 9న ఉపసంహరణకు గడువు ఉంటుంది. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగుతుంది. ఓట్ల లెక్కింపు మిగిలిన రాష్ట్రాలతో పాటే మే 4న జరుగుతుంది మరియు మే 6 నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది.

తమిళనాడు: తమిళనాడు రాష్ట్ర శాసనసభ ఎన్నికల షెడ్యూల్ పశ్చిమ బెంగాల్ తరహాలోనే ఉంది. మార్చి 30న గెజిట్ నోటిఫికేషన్, ఏప్రిల్ 6 నామినేషన్ల దాఖలుకు గడువు ఉంటుంది. ఏప్రిల్ 7న పరిశీలన, ఏప్రిల్ 9న ఉపసంహరణ గడువు ముగుస్తుంది. తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగుతుంది. మే 4న ఓట్ల లెక్కింపు, మే 6 నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తారు.





| Poll Events | Date and Day |
|---|---|
| Date of Issue of Gazette Notification | 30.03.2026 (Monday) |
| Last Date for making Nominations | 06.04.2026 (Monday) |
| Date for the scrutiny of Nominations | 07.04.2026 (Tuesday) |
| Last date for the withdrawal of candidatures | 09.04.2026 (Thursday) |
| Date of Poll | 23.04.2026 (Thursday) |
| Date of Counting | 04.05.2026 (Monday) |
| Date before which election shall be completed | 06.05.2026 (Wednesday) |

SOCIAL MEDIA CELL *Map for representative purposes only





| Poll Events | First Phase (152 ACs) Date and Day | Second Phase (142 ACs) Date and Day |
|---|---|---|
| Date of Issue of Gazette Notification | 30.03.2026 (Monday) | 02.04.2026 (Thursday) |
| Last Date for making Nominations | 06.04.2026 (Monday) | 09.04.2026 (Thursday) |
| Date for the scrutiny of Nominations | 07.04.2026 (Tuesday) | 10.04.2026 (Friday) |
| Last date for the withdrawal of candidatures | 09.04.2026 (Thursday) | 13.04.2026 (Monday) |
| Date of Poll | 23.04.2026 (Thursday) | 29.04.2026 (Wednesday) |
| Date of Counting | 04.05.2026 (Monday) | |
| Date before which election shall be completed | 06.05.2026 (Wednesday) | |

SOCIAL MEDIA CELL *Map for representative purposes only




| Poll Events | Date and Day |
|---|---|
| Date of Issue of Gazette Notification | 16.03.2026 (Monday) |
| Last Date for making Nominations | 23.03.2026 (Monday) |
| Date for the scrutiny of Nominations | 24.03.2026 (Tuesday) |
| Last date for the withdrawal of candidatures | 26.03.2026 (Thursday) |
| Date of Poll | 09.04.2026 (Thursday) |
| Date of Counting | 04.05.2026 (Monday) |
| Date before which election shall be completed | 06.05.2026 (Wednesday) |

SOCIAL MEDIA CELL *Map for representative purposes only




| Poll Events | Date and Day |
|---|---|
| Date of Issue of Gazette Notification | 16.03.2026 (Monday) |
| Last Date for making Nominations | 23.03.2026 (Monday) |
| Date for the scrutiny of Nominations | 24.03.2026 (Tuesday) |
| Last date for the withdrawal of candidatures | 26.03.2026 (Thursday) |
| Date of Poll | 09.04.2026 (Thursday) |
| Date of Counting | 04.05.2026 (Monday) |
| Date before which election shall be completed | 06.05.2026 (Wednesday) |

SOCIAL MEDIA CELL *Map for representative purposes only

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / యజమాని : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.